JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 27-05-2026
Medchal - Malkajgiri । Wednesday 27-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 361
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 361 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





# టీమ్ 2029

- సౌత్ టార్గెట్ గా కేబినెట్ విస్తరణ

- జయభేరి, న్యూఢిల్లీ, మే 26 :

ఢిల్లీ రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా కేంద్ర మంత్రివర్గ విస్తరణ గురించిన చర్చలే నడుస్తున్నాయి. మోదీ 3.0 ప్రభుత్వం కొలువుదీరి దాదాపు రెండేళ్లు కావస్తున్న తరుణంలో, పాలనలో సరికొత్త జోష్ నింపేందుకు ప్రధాని భారీ మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సారి జరగబోయే విస్తరణలో కేవలం ఎంపీలు మాత్రమే కాదు, ఏకంగా ఇద్దరు ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులకు కూడా చోటు దక్కబోతోందనేది ప్రధానంగా వినిపిస్తున్న గాసిప్. ఈ సారి మంత్రివర్గంలోకి మాజీ ముఖ్యమంత్రులను తీసుకు రావడం ద్వారా అనుభవం అనే కార్డును మోదీ ప్లే చేయబోతున్నారు. ఇప్పటికే శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి వారు కేబినెట్‌లో ఉండగా, మరో ఇద్దరు లేదా ముగ్గురు మాజీ సీఎంల పేర్లు ఇప్పుడు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిని కేబినెట్ స్థాయి హోదాతో కీలక మంత్రిత్వ శాఖలకు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. వీరిలో ఇప్పటికే రాజీనామా చేసిన నితీష్ కుమార్ తో పాటు మరో ఇద్దరు ముగ్గురు ముఖ్యమంత్రుల్ని మార్చి మరీ కేంద్రానికి తీసుకువస్తారని అంటున్నారు. 2026 మే నెలలో జరగబోయే ఈ మార్పులను రాజకీయ వర్గాలు 'మిడ్-టర్మ్ రీసెట్'గా అభివర్ణిస్తున్నాయి. పనితీరు సరిగా లేని మంత్రులను సాగనంపి, వచ్చే సాధారణ ఎన్నికల నాటికి పార్టీని, ప్రభుత్వాన్ని బలోపేతం చేసే దిశగా కొత్త ముఖాలను ప్రవేశపెట్టబోతున్నారట. కేవలం సీనియర్లే కాకుండా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బాగా పనిచేసిన యువ నేతలకు,




# పోలీసుల కస్టడీకి బండి భగీరథ్

- పోక్సో కేసులో కీలక పరిణామం
- పోక్సో కేసులో అరెస్ట్ అయిన బండి భగీరథ్
- మూడు రోజుల కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరిన పోలీసులు
- బండి భగీరథ్‌ను పోలీసుల కస్టడీకి ఇచ్చేందుకు కోర్టు ఆదేశాలు

జయభేరి, హైదరాబాద్ :

తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన హైదరాబాద్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితుణ్ని తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేయగా.. మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇస్తూ మేడ్చల్ మల్కాజిగిరి పోక్సో కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు అతణ్ని మూడు రోజులపాటు విచారించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితుడు బండి భగీరథ్‌ను పోలీసుల కస్టడీకి మేడ్కల్ మల్కాజిగిరి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు భగీరథ్‌ను మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించనున్నారు. ఈ కేసులో లోతుగా విచారణ జరపడం నిందుతుణ్ని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. దాన్ని విచారించిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పును వెలువరిచింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను మే 22వ తేదీనే విచారించిన న్యాయస్థానం.. మే 26వ తేదీకి విచారణను వాయిదా వేసింది. నాలుగు రోజుల క్రితం తెలిపినట్లుగానే కస్టడీ పిటిషన్‌ను నేడు విచారించిన కోర్టు.. పోలీసులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ కేసు విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. సిట్ ఇప్పటికే బాధితురాలితోపాటు ఆమె తల్లితో మాట్లాడి.. వారి దగ్గర్నుంచి కీలక సమాచారాన్ని సేకరించింది. బండి భగీరథ్ స్నేహితులను సైతం సిట్ విచారించింది.

...మిగతాది 2 లో



# అరెస్ట్ కు సిద్ధం.. బెయిల్ అడగను

*ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తాను చేసిన వ్యాఖ్యల వివాదంపై నమోదైన కేసుల విషయంలో రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అరెస్ట్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, తాను అరెస్ట్‌కు సిద్ధంగా ఉన్నానని, ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించబోనని స్పష్టం చేశారు. "నాపై కేసు నమోదు చేశారు. ఆ మరుసటి రోజే నన్ను అరెస్ట్ చేస్తారని నాకు సమాచారం అందింది. నేను ఎక్కడికీ వెళ్లను, ఇంట్లోనే ఉంటాను, అరెస్ట్ చేసుకోండి. ఇప్పటివరకు నేను ముందస్తు బెయిల్ పిటిషన్ వేయలేదు, వేయను కూడా. కేసు కొట్టేయాలని క్వాష్ పిటిషన్ కూడా ఇంకా వేయలేదు. నేను అరెస్ట్‌కు సిద్ధం. చేసుకోండి" అని ఆయన సవాల్ విసిరారు.*

- ప్రొఫెసర్ నాగేశ్వర్

జయభేరి, హైదరాబాద్, మే 26 :

తన జీవితంలో అనేక అనుభవాలు ఉన్నాయని, జైలు జీవితం అనే అనుభవం మాత్రమే మిగిలి ఉందని ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యానించారు. "నాకు విద్యార్థి ఉద్యమాలు, ప్రజా పోరాటాలు, చట్టసభలు, మీడియాలో పనిచేసిన అనుభవాలు ఉన్నాయి. జైలు జీవితం అనుభవం లేదు. ఒకవేళ అది కూడా వస్తే, నా ఆత్మకథ రాసుకోవడానికి అదొక పరిపూర్ణమైన అధ్యాయం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు.కొన్ని రోజుల క్రితం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కొన్ని వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. దీంతో జనసేన కార్యకర్తలు, నాయకులు ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫలితంగా ఆయనపై కేసులు నమోదయ్యాయి. అయితే, ఆ తర్వాత ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. దీనిపై స్పందించిన జనసేన పార్టీ కూడా, ఆయన వ్యాఖ్యల ఉపసంహరణను ఆమోదిస్తూ ఈ వివాదానికి ముగింపు

...మిగతాది 2 లో



# భూ కన్వర్షన్ కోసం ఎమ్మార్వో లంచం డిమాండ్

- ఎకరానికి రూ.లక్ష చొప్పున రూ.30 లక్షలకు బేరం.. అడ్డంగా దొరికిన ఎమ్మార్వో
- రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ
- సరిగ్గా రెండేళ్ల కిందట కూడా ఇటువంటి ఘటన

జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని శామీర్‌పేట్ ఎమ్మార్వో ఆఫీసు మరోసారి వార్తల్లో నిలిచింది. ఓ భూ కన్వర్షన్‌కు సంబంధించి ఎకరాకు రూ. లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ఇందుకోసం అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ ఎంట్రీతో సీన్ రివర్స్ అయ్యింది. ఎమ్మార్వో, అధికారి కారు డ్రైవర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను, ఫైళ్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రెండేళ్ల కిందట కూడా ఇలాగే జరిగింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలకు మరో భారీ తిమింగలం చిక్కింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట్ ఎమ్మార్వో ఆఫీసులో ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు

...మిగతాది 2 లో



# ఆలోపు ఇలా చేయకపోతే..

## తల్లికి వందనం డబ్బులు రూ.15వేలు రానట్టే..!



*ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యార్థులకు ఇదో బిగ్ అలర్ట్.. వేసవి సెలవులు ముగిశాయి.. మరో వారం రోజుల్లో రాష్టవ్యాప్తంగా స్కూల్‌లు తెరుచుకోఉన్నాయి. దీంతో తల్లికి వందనం నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే తల్లికి వందనం కింద రాష్ట ప్రభుత్వం అందిస్తున్న రూ.15వేలు మీరు రావాలంటే ఈ చిన్న పని మీరు చేయాల్సిందే.. లేదంటే మీకు డబ్బులు రానట్టే..!*


జయభేరి, విజయవాడ, మే 26 :

ఏపీలోని పాఠశాలకు విద్యార్థులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. తల్లికి వందనం కింద అందిస్తున్న రూ.15వేలు అందేందుకు వెంటనే బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద విద్యార్థులకు అండగా ఉండేందుకు తల్లికి వందనం అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని 2024-2025 విద్యాసంవత్సరం నుండి ప్రభుత్వం అధికారికండా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం కింద 1వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రతి ఏటా రూ.15వేలు అందిస్తోంది. అయితే ప్రభుత్వం అందిజేస్తున్న మొత్తం రూ.15వేలలో రూ.13వేలు నేరుగా తల్లి అకౌంట్లో జమ చేస్తుండగా మిగతా రూ.2వేలను స్కూళ్ల నిర్వహణ కోసం కేటాయిస్తున్నారు. అయితే వేసవి సెలవులు ముగిసి జూన్‌లో కొత్త విద్యా సంవత్సరం స్టార్ట్ అవుతున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఈ నిధులు అకౌంట్లో జమ అవ్వాలంటే విద్యార్థి తల్లి బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేయడం

...మిగతాది 2 లో

# ప్రభుత్వ భూమి ప్రైవేట్‌పరమేల?

## శంషాబాద్‌లో వెయ్యి కోట్ల భూ దందా!




- 170 ఎకరాల సర్కార్ భూమి ప్రైవేట్ వ్యక్తులకు పట్టా
- అది ప్రైవేట్ వ్యక్తులదని 4 రోజులకు ఎమ్మార్వో రిపోర్ట్
- హైకోర్టుకు ఆర్డీవో, తహసీల్దార్ వేర్వేరు రిపోర్టులు
- ఎమ్మార్వో ఇంటిపైకి వెళ్లిన ఏసీబీ మళ్లీ వాపస్ వచ్చింది
- సీఎం సన్నిహితుడి వల్లే ఏసీబీ వెనకి.. తహసీల్దార్ సేఫ్
- సిట్, సీఐడీ దర్యాప్తు జరిపి విలువైన భూమిని కాపాడాలి
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్ డిమాండ్

"రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దషాపూర్ సర్వే నంబర్ 173 నుంచి 183 వరకు ఉన్న 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టింద్రు. ఈ కుంభకోణం వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన ముఖ్య అనుచరుడైన ఓ కార్పొరేషన్ చైర్మన్, ఒక మంత్రి ఉన్నరు. సిట్ లేదా సీఐడీ దర్యాప్తు జరిపి స్కామ్‌తో సంబంధమున్న వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని నిషేధిత జాబితాలో చేర్చాలి. – హరీశ్‌రావు



# ఫైనల్లో ఆర్సీబీ..!

రెండో టైటిల్‌పై కన్నేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫయర్ 1లో గర్జించింది. ధర్మశాలలో ఏకపక్ష పోరులో గుజరాత్ టైటాన్స్ పై ఘన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. రజత్ పటిదార్(93) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రికార్డు స్కోర్ కొట్టిన ఆర్సీబీ.. జాకబ్ డఫ్ఫీ(39-3), రసిక్ దార్ సలాం(24-2), భువనేశ్వర్(28-4) విజృంభణతో గుజరాత్‌ను చిత్తు చేసి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఘోర ఓటమి చవిచూసిన శుభ్‌మన్ గిల్ సేన ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది. 19వ సీజన్ క్వాలిఫయర్ 1లో 254 పరుగులతో అత్యధిక స్కోర్ రికార్డు బద్ధలు కొట్టిన ఆర్సీబీ.. గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కనీసం పోరాడకుండానే మ్యాచ్‌ను బెంగళూరుకు అప్పగించేసింది. పేసర్లు జాకబ్ డఫ్ఫీ (39-3) రసిక్ దార్(24-2), హేజిల్‌వుడ్(39-1)లు వికెట్ల వేటతో చెలరేగగా ప్రత్యర్థిని 162 కే కట్టడి చేసిన రజత్ పటిదార్ బృందం 92 పరుగుల భారీ విజయంతో ఫైనల్లో అడుగుపెట్టింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## టీమ్ 2029

అలాగే రాబోయే అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు చెందిన నేతలకు ఈసారి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యాన్ని పెంచడం ద్వారా 2029 ఎన్నికల లక్ష్యంగా అడుగులు వేయాలని బీజేపీ హైకమాండ్ భావిస్తోంది. ప్రస్తుతం కొందరు మంత్రులు రెండు మూడు శాఖలను నిర్వహిస్తున్నారు. ఈ అదనపు బాధ్యతలను తగ్గించి, ప్రత్యేకంగా ఒక్కో శాఖకు ఒక్కో మంత్రిని కేటాయించేలా ప్లాన్ చేస్తున్నారు. రక్షణ, హోమ్, ఆర్థిక వంటి కీలక శాఖల్లో మార్పులు ఉండకపోవచ్చని చెబుతున్నప్పటికీ, రైల్వే, ఐటీ, పౌర విమానయాన వంటి శాఖల్లో కొత్త వారు వచ్చే అవకాశం ఉందని గాసిప్స్ వినిపిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూన్ 10 లోపునే విస్తరణ ప్రక్రియ ముగించాలని చూస్తున్నారట. ఎవరెవరికి బెర్తులు దక్కుతాయి? ఎవరికి ఉద్వాసన పలుకుతారు? అనే ఉత్కంఠ ఇప్పుడు ఎంపీల్లో నెలకొంది. ఈసారి విస్తరణలో సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఖచ్చితంగా ఉంటాయని, ఊహించని పేర్లు తెరపైకి వస్తాయని ఎక్కువ మంది నమ్ముతున్నారు.

## భూ కన్వర్షన్ కోసం ఎమ్మార్వో లంచం

నిర్వహించారు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ.. ఎమ్మార్వో సుచరిత ఆఫీసులో సోదాలు చేపట్టింది. ఈ క్రమంలో బాధితుడి నుంచి ఆమె కారు డ్రైవర్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని, వాటిని సుచరితకు అందిస్తుండగా ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన దాదాపు రూ. 30 లక్షల భారీ లావాదేవీలకు సంబంధించిన కేసులో ఈ దాడులు నిర్వహించారు. ఎమ్మార్వో సుచరితతో పాటు ఆమె కారు డ్రైవర్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ దాడులు నిరర్వహించారు. సోదాల అనంతరం మీడియా సమావేశంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వివరాలను వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టామని, ఎకరానికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమికంగా తేలిందని తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ సుచరిత.. డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్నామని అన్నారు. ఎమ్మార్వో ఆఫీసులో కీలక పత్రాలు, భూకన్వర్షన్‌కు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వీటి పరిశీలించి, ఎమ్మార్వో సుచరిత, ఆర్డీఓ కీసర రాజేష్ సహా పలువురు సిబ్బందిని విచారిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రెండేళ్ల కిందట కూడా శామీర్‌పేట ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి పట్టుబడిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే ఎమ్మార్వో ఆఫీసులో ఏసీబీ దాడులు జరగడం చర్చనీయాంశంగా మారింది.

## ఆలోపు ఇలా చేయకపోతే..

తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. గత సవంత్సరం ఇలా తల్లి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ కార్డు లింక్ లేకపోవడంతో.. చాలామంది విద్యార్థులు అర్హత ఉండి కూడా తల్లికి వందనం నిధులు పొందలేదని తెలిపారు. కాబట్టి పోయినసారి ఎదురైన సమస్యను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ విద్యార్థుల తల్లులను అలర్ట్ చేసింది. అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకుల దగ్గరకు వెళ్లి తమ అకౌంట్‌కు ఆధార్ లింక్ ఉందో లేదో చెక్ చేసుకోవాలని సూచించింది. ఒకవేళ బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ కాకపోతే వెంటనే చేసుకోవాలని.. లేకపోతే డబ్బులు అకౌంట్‌లో జమ కావని తెలిపింది.

**బ్యాంక్ ఖతాకు ఆధార్ లింగ్ చేయడం ఎలా?**

మీరు నేరుగా మీ బ్యాంక్ శాఖకు వెళ్లి చాలా సులభంగా ఈ పని పూర్తి చేయవచ్చు. ఇందుకోసం మీ ఆధార్ కార్డ్ ఒరిజినల్, జిరాక్స్, మీ బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ తీసుకెళ్లండి.. బ్యాంక్‌లో KYC Form అడిగి తీసుకోండి. అందులో మీ బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ నంబర్, మీ సంతకం చేయండి. ఆ ఫారమ్‌కు ఆధార్ జిరాక్స్ జతచేసి బ్యాంక్ సిబ్బందికి ఇవ్వండి. వారు మీ బయోమెట్రిక్ లేదా ఓటిపి ద్వారా వెరిఫై చేస్తారు. సాధారణంగా 2 నుండి 3 పని దినాలలో మీ లింకింగ్ ప్రక్రియ పూర్తవుతుంది

## పోలీసుల కస్టడీకి బండి భగీరథ్

పోక్సో కేసు నమోదు కావడంతో నిందితుడు బండి భగీరథ్ చాలా రోజులపాటు అజ్ఞాతంలో ఉన్నాడు. అతడి ఆచూకీ కోసం పోలీసులు బలగాలు కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసంలోనూ గాలించాయి. కానీ ఫలితం లేకపోయింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకోవాలని తెలంగాణ పోలీసులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మే 16న నిందితుడు లొంగిపోయాడు.

2025 జూన్‌లో బాధిత బాలికకు కామన్ ఫ్రెండ్స్ ద్వారా భగీరథ్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరు స్నేహంగా మెలిగారు. ఆ ఏడాది అక్టోబర్ డిసెంబర్ నెలల మధ్య భగీరథ్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, మద్యం సేవించాలని ఒత్తిడి తీసుకొచ్చాడని బాధితురాలు ఆరోపించింది. ఈ ఏడాది జనవరిలో ఇద్దరి మధ్య బ్రేకప్ అయ్యింది. దీంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురైన బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసిందని ఆమె తల్లి పేర్కొంది. బాధితురాలి కుటుంబం చట్టపరంగా ముందుకెళ్లాలని నిర్ణయించుకోవడంతో.. రాజీ ప్రయత్నాలు జరిగాయి. నిందుతుడి తండ్రి తన రాజకీయ పలుకుబడిని గురించి హెచ్చరించినట్లు బాధితురాలి తల్లి ఆరోపించింది. మే 8న కరీంనగర్ టూ టౌన్ పోలీసు స్టేషన్లో భగీరథ్ తరఫున కేసు నమోదైంది. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే రోజు రాత్రి హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్లో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. మరుసటి రోజు తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అనంతరం ముందస్తు బెయిల్ కోసం నిందితుడు ప్రయత్నించారు. బాధితురాలు మైనర్ కాదని భగీరథ్ తరపు లాయర్ వాదనలు వినిపించారు. కానీ బెయిల ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. దీంతో మే 16న నార్సింగి పోలీసు స్టేషన్లో నిందితుడు లొంగిపోయాడు. మే 21న నిందితుడు ముందస్తు బెయిల్ పిటిషన్ వెనక్కి తీసుకోవడానికి అనుమతి ఇచ్చిన హైకోర్టు, సాధారణ బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

## ఇద్దరు సీనియర్ మావోయిస్టుల లొంగుబాటు

✍ జయభేరి, హైదరాబాద్ :

ఇద్దరు సిపిఐ (మావోయిస్టు) అత్యంత సీనియర్ నేత, సెంట్రల్ కమిటీ సభ్యుడు (CCM) మరియు బీహార్‌జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ (BJSAC) కార్యదర్శి పసునూరి నరహరి @ విశ్వనాథ్ @ సలై దా, మరియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు (SCM), మేదర దానమ్మ @ లత @ పూనం @ జోబా నిషేధిత సిపిఐ (మావోయిస్టు) పార్టీని వీడి తెలంగాణ పోలీసుల ఎదుట జన జీవన స్రవంతిలో కలిసారు. తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ఎదుట, కేంద్ర కమిటీ సభ్యుడు (CCM) , బీహార్‌జార్ఖండ్ ప్రత్యేక ప్రాంతీయ కమిటీ (BJSAC) కార్యదర్శి న పసునూరి నరహరి @ విశ్వనాథ్ @ సలై దా; మరియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు (SCM) మేదర దానమ్మ @ లత @ పూనమ్ @ జోబా లు జన జీవన స్రవంతిలో చేరడంతో, సిపిఐ (మావోయిస్టు) పార్టీకి ఒక పెద్ద ఎదురుదెబ్బ గా పోలీసులు భావిస్తున్నారు. ఆ పార్టీకి మిగిలి ఉన్న ఏకైక తూర్పు ప్రాంతీయ బ్యూరో (ERB) కూడా పతనం అంచుకు చేరింది.

# రూపాయి పతనం.. ఎవరికి భారం...



అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారత రూపాయి విలువ తీవ్రంగా పతనం అవుతోంది. దీంతో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఇక రూపాయి పథనం విదేశాల్లో చదువుతున్న లక్షలాది భారతీయ విద్యార్థుల జీవితాలను గణనీయంగా ప్రభావితం చేస్తోంది. 'టూ గుడ్ టు గో' అనే యాప్‌లో ఆఖరి నిమిషంలో దొరికే ఈ ఆహారం కోసం విద్యార్థులుగా తాము స్టోర్లకు పరుగు పెట్టాలని, ఒక్క క్షణం ఆలస్యమైనా మరొకరు దాన్ని సొంతం చేసుకుంటారని మాన్వి కోలి చెబుతోంది. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఈ ఏడాది మార్చిలో భారత్‌కు తిరిగి వచ్చిన ఆమె, సుమారు మూడు నెలల పాటు ఇలా గడువు ముగియడానికి సిద్ధంగా ఉన్న ఆహారంతోనే కడుపు నింపుకున్నానని చెప్పింది. అప్పుడు డాలర్‌తో రూపాయి విలువ 93 దాటగా, ఇప్పుడు 95 దాటి ఎప్పుడైనా 100 మార్కును తాకొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రూపాయి పతనం విదేశీ విద్యార్థుల జీవితాలను ఎంత కఠినంగా మార్చిందో మాన్వి మాటలు అద్దం పడుతున్నాయిప్రస్తుతం ఒక డాలర్‌కు 95-96 రూపాయలుగా ఉంది. ఇదియూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఫీజు, హాస్టల్, జీవన వ్యయాలను భారీగా పెంచేసింది. డిస్కౌంట్ ఆహారం కొనడం, దూరాలు నడవడం, టాప్-అప్ లోన్లు తీసుకోవడం, కొందరు స్టేషన్లలో శుభ్రతా పనులు చేయడం వంటి చర్యలు సాధారణమవుతున్నాయి .2025లో సుమారు 12 లక్షలకు పైగా భారతీయ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. అయినప్పటికీ, రూపాయి బలహీనత వల్ల ఖర్చులు 5-10 శాతం పెరగడంతో చాలా మంది తమ బడ్జెట్‌ను పునరాలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూఎస్‌లో 40 వేల డాలర్ల సెమిస్టర్ ఫీజు కొన్ని సంవత్సరాల క్రితం 30 లక్షలు రూపాయలు అయితే, ప్రస్తుతం దాదాపు 38 నుంచి 40 లక్షల రూపాయలకు చేరుతోంది. ఇది మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఎత్తున ఒత్తిడి తెస్తోంది. చాలా మంది విద్యార్థులు ఎడ్యుకేషన్ లోన్లపై ఆధారపడి చదువుతున్నందున, రూపాయి పతనం రుణ మొత్తాన్ని పెంచుతోంది. సెమిస్టర్-వారీ ఫీజు చెల్లింపుల సమయానికి అసలు లోన్ సరిపోకపోవడంతో టాప్-అప్ లోన్లు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో వడ్డీ భారం కూడా పెరుగుతోంది. జీవన వ్యయాలు (ఆహారం, రవాణా, పుస్తకాలు) కూడా డాలర్/పౌండ్ ఆధారితమైనందున, నెలవారీ ఖర్చులు గణనీయంగా ఎగిస్తున్నాయి. విదేశాల్లో ఉన్న యువతలో చాలా మంది తమ ఖర్చులను తగ్గించుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారు. ఎక్స్‌పైరీ డేట్ దగ్గరలో ఉన్న ఆహారాన్ని డిస్కౌంట్ ధరలకు కొనుగోలు చేయడం, యూనివర్సిటీ క్యాంపస్‌నుంచి దూరంగా ఉంటూ కాలినడకన వెళ్లడం, పార్ట్-టైమ్ జాబ్స్ (కొన్ని సందర్భాల్లో శుభ్రతా పనులు కూడా) చేయడం సాధారణం అవుతోంది. ఇది వారి చదువు, ఆరోగ్యం, మానసిక స్థితిని కూడా ప్రభావితం చేస్తోంది. ఈ పరిస్థితి మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులను మరింత ఎక్కువగా బాధిస్తోంది. తల్లిదండ్రులు ఇంట్లో ఇతర ఖర్చుల మధ్య ఈ భారాన్ని మోయాల్సి వస్తోంది. రూపాయి పతనానికి అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు, డాలర్ బలం, విదేశీ ఇన్వెస్టర్ల నమ్మకం, వాణిజ్య లోటు వంటి అనేక కారణాలు ఉన్నాయి. దీని ప్రభావం విదేశీ విద్య మీద మాత్రమే కాక, దేశంలోని దిగుమతులు, ద్రవ్యోల్బణం, సాధారణ ప్రజల జీవన వ్యయం మీద కూడా పడుతోంది. విదేశీ విద్యపై ఆధారపడటం సవాళ్లను ఈ పరిస్థితి ఎత్తి చూపుతోంది. ఒకవైపు ప్రపంచ స్థాయి విద్య కోసం వెళ్తున్న యువత, మరోవైపు ఆర్థిక అస్థిరత వల్ల కలిగే కష్టాలు. ఇది దేశానికి పెద్ద సవాల్. రూపాయి పతనం ఒక ఆర్థిక సూచిక మాత్రమే కాదు. విదేశీ విద్య అనగానే అందరూ ఊహించుకునే రంగుల ప్రపంచానికి, వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. రూపాయి విలువ పడిపోతుండటంతో భారతీయ విద్యార్థులు కనీస అవసరాల కోసం తీవ్రంగా బడ్జెట్ వేసుకోవాల్సి వస్తోంది. పార్ట్‌టైమ్ ఉద్యోగాలతో పాటు డిపార్ట్‌మెంటల్ స్టోర్లు, రైల్వే స్టేషన్లలో ఫ్లోర్ క్లీనింగ్ వంటి పనులు చేయడం, రోజుకు ఒక్కపూట భోజనంతో సరిపెట్టుకోవడం, కొన్నిసార్లు పస్తులుండటం వంటివి సాధారణమయ్యాయి. డిస్కౌంట్లు, రేషన్ సరుకులు, కిరాణా బిల్లులను జాగ్రత్తగా పంచుకోవడం వారి దైనందిన జీవితంలో భాగమైంది. ప్రజా రవాణా, ఖరీదైన క్యాబ్ రైడ్‌లకు బదులుగా కిలోమీటర్ల కొద్దీ నడవడం పరిపాటిగా మారింది "విదేశాల్లో చదువుకునే అవకాశం వచ్చిన ప్రతి ఒక్కరూ సంపన్న కుటుంబం నుంచి రారు. స్కాలర్‌షిప్‌లపై వచ్చేవారు, తల్లిదండ్రులు ఇళ్లు తాకట్టు పెట్టి చదివించే మధ్యతరగతి కుటుంబాల వారే ఎక్కువ" అని మహారాష్ట్రకు చెందిన మాన్వి వివరించారు. ఎడ్యుకేషన్ లోన్ తీసుకుని చదివిన ఆమె, బడ్జెట్ వేసుకునేటప్పుడు రూపాయి విలువ మార్పును పరిగణనలోకి తీసుకోకపోవడం పెద్ద తప్పని అన్నారు. "నేను భారత్ విడిచి వెళ్లినప్పుడు డాలర్ విలువ రూ. 85 ఉంటే, తిరిగి వచ్చేసరికి రూ. 93కి చేరింది" అని ఆమె తెలిపారురూపాయి పతనం విద్యార్థులపై రెండు రకాలుగా ప్రభావం చూపుతోంది. మొదటిది, ట్యూషన్ ఫీజులు, నివాస ఖర్చులు రూపాయిలలో పెరిగిపోవడం. రెండోది, భారత్‌లో తీసుకున్న విద్యా రుణాలు సరిపోకపోవడం. చాలా విదేశీ యూనివర్సిటీలు సెమిస్టర్ల వారీగా ఫీజులు వసూలు చేస్తాయి. రూపాయి విలువ పడిపోవడంతో, తర్వాతి సెమిస్టర్లకు కట్టాల్సిన ఫీజుకు పాత లోన్ సరిపోవడం లేదు. దీంతో కుటుంబాలు అదనపు భారాన్ని మోయలేక 'టాప్‌అప్ లోన్లు' తీసుకోవాల్సి వస్తోంది. ఇది వేలాది యువతల కలలు, కుటుంబాల త్యాగాలు, దేశ భవిష్యత్తుపై పడుతున్న ఒత్తిడి. విదేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థులు కేవలం వ్యక్తులు కాదు వారు దేశ మేధా సంపద. వారి కష్టాలను తగ్గించడం, దేశీయ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, ఆర్థిక స్థిరత్వం కోసం సమగ్ర విధానాలు రూపొందించడం ద్వారా మాత్రమే ఈ సవాలును అవకాశంగా మార్చుకోవచ్చు. ఈ ఆర్థిక ఒత్తిడి విద్యార్థుల చదువుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ అనీషా గుప్తా అన్నారు. "పూట గడవడమే కష్టంగా ఉన్నప్పుడు, చదువుపై ఎలా దృష్టి పెట్టగలరు? నిరంతరం ఖర్చుల గురించి ఆలోచిస్తూ ఒత్తిడికి గురైతే, అకడమిక్‌గా రాణించడం అసాధ్యం" అని ఆమె స్పష్టం చేశారు. ఒకే గదిలో నలుగురైదుగురు సర్దుకుపోవడం, భోజనం మానేయడం వంటివి పాశ్చాత్య దేశాల్లోని వారికి షాకింగ్‌గా ఉంటాయని, కానీ ఇక్కడ ఇదే వాస్తవమని ఆమె తెలిపారు. డాలర్‌కు రూపాయి విలువ 100కు చేరువ కావడం కేవలం ఆర్థిక గణాంకం కాదు. ఇది విదేశాల్లోని లక్షలాది మంది భారతీయ విద్యార్థుల ఆకలిని, వారి కుటుంబాల ఆందోళనను, వారి భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితిని ప్రతిబింబిస్తోంది. మెరుగైన భవిష్యత్తు కోసం దేశం విడిచి వెళ్లిన వారి కలలను కరెన్సీ కష్టాలు కబళిస్తున్నాయి.

# ప్రభుత్వ భూమి ప్రైవేట్‌పరమేల?



✍ జయభేరి, హైదరాబాద్, మే 26 :

కాంగ్రెస్ పాలనలో అవినీతి పెరిగిపోయిందని, భూముల కొల్లగొట్టుడు, కబ్జాచేసుడు నిత్యకృత్యంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. వెయ్యి కోట్ల విలువైన 170 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలు కబ్జా పెట్టారని, తమ పేరున అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని మండిపడ్డారు. రూ.1,000 కోట్ల భూస్కామ్ వివరాలను మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆధారాలు సహా మీడియాకు ఆయన వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 173 నుంచి 183 వరకు ఉన్న 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని, ఈ కుంభకోణం వెనుక రేవంత్‌రెడ్డి, ఆయన ముఖ్య అనుచరుడైన ఓ కార్పొరేషన్ చైర్మన్, ఒక మంత్రి ఉన్నారని చెప్పారు. సిట్ లేదా సీఐడీ విచారణ జరిపి స్కామ్‌తో సంబంధమున్న వారిపై చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ భూమి ప్రైవేట్‌పరమేల?**

పెద్దషాపూర్‌లోని సదరు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ వేసి నిషేధిత జాబితాలోపెట్టాలని 2024 ఫిబ్రవరి 24న తహసీల్దార్‌కు ఆర్డీవో ఆదేశాలు జారీచేశారని హరీశ్‌రావు చెప్పారు. అదే రోజు ఈ భూమి ప్రభుత్వానిదేనని ఆర్డీవో హైకోర్టులో అఫిడవిట్ కూడా దాఖలు చేశారని గుర్తుచేశారు. నాలుగు రోజుల తర్వాత ఫిబ్రవరి 28న ఆ భూమి ప్రైవేట్ వ్యక్తులదని తహసీల్దార్ ఆర్డర్ పాస్ చేశారని చెప్పారు. ఇదే విషయాన్ని హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా పొందుపర్చారని తెలిపారు. ఆర్డీవో, తహసీల్దార్ వేర్వేరుగా ఇచ్చిన ఆర్డర్లను మీడియాకు చూపించారు. ఎవరెవరి పేరుతో ఎంతెంత భూమి పట్టా అయ్యిందో కూడా తమ వద్ద వివరాలను ఉన్నాయని, అవసరమైనప్పుడు అన్నీ బయట పెడుతామని, భూభారతి నుంచి తీసిన పట్టా వివరాలను హరీశ్‌రావు మీడియాకు చూపించారు. ఆర్డీవో, తహసీల్దార్ భిన్నంగా అఫిడవిట్లు ఇస్తే జీపీ రెవెన్యూ హైకోర్టుకు ఎలా ఇచ్చారు? అని నిలదీశారు.

**అధికారులపై చర్యలేవీ?**

వెయ్యి కోట్ల విలువైన భూ సామ్ జరిగితే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. కేవలం ఎమ్మార్వోను కలెక్టరేట్‌కు ట్రాన్స్‌ఫర్‌చేసి ఊరుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి అతి సన్నిహితుడు ఈ భూస్కామ్‌లో ఉన్నందునే ఏసీబీ వెనకి వచ్చిందని, ఆయన ఒత్తిడి వల్లే ఎమ్మార్వోను కేవలం చిన్న బదిలీతో సరిపెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెయ్యి కోట్ల విలువైన భూమి వెనుక కలెక్టర్ ఉన్నారా?, ప్రభుత్వ పెద్దలు ఉన్నారా? రాత్రికి రాత్రి ప్రైవేట్ భూమి ఎలా అయ్యింది? అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిపై ఆర్డీవో ఆర్డర్‌ను ధికరించి ఎవరి అండతో ఎమ్మార్వో ప్రైవేట్ వ్యక్తులకు పట్టా భూమిగా మార్చారో తేల్చాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆర్డర్‌పై అప్పీల్‌కు వెళ్లి, ఆ భూమిని తిరిగి నిషేధిత జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. సిట్ లేదా సీఐడీ విచారణ జరిపి, దీని వెనుక కలెక్టర్, సీసీఎల్ఏ, ఉన్నతాధికారులు ఉన్నారా? అని ఆరా తీయాలని పట్టుబట్టారు. మీది నిజంగా ప్రజాపాలన అయితే, ఈ స్కామ్‌లో ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం లేకపోతే తహసీల్దార్‌ను వెంటనే డిస్మిస్ చేసి, ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు సబిత, సత్యవతి, కొప్పుల, ఎమ్మెల్సీలు రమణ, దేశపతి శ్రీనివాస్, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కోవ లక్ష్మి పాల్గొన్నారు.

**డ్రైవర్ అశోక్ సస్పెన్షన్ సరికాదు**

జగిత్యాలలో ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై సస్పెన్షన్ వేటు వేయడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. 'ఆయన ఆర్టీసీ డ్రైవర్ కావొచ్చు, కానీ, ఒక రైతుబిడ్డ. రైతుల కష్టాలు చూడలేక.. వడ్లు కొనాలని అడిగితే తప్పెలా అవుతుంది? అశోక్‌కు బీఆర్ఎస్ అండగా ఉంటుంది, న్యాయపోరాటం, ప్రత్యక్ష పోరాటానికి ఆయన వెంటే ఉంటాం' అని హరీశ్‌రావు స్పష్టంచేశారు.

**తహసీల్దార్ ఉత్తర్వులపై చర్యలు తీసుకుంటాం.. రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి**

రంగారెడ్డి, మే 26(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ గ్రామంలో 174 ఎకరాలకు సంబంధించి శంషాబాద్ తహసీల్దార్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడానికి న్యాయసలహా ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దషాపూర్ భూముల విషయంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేసిన ఆరోపణలపై మంగళవారం వివరణ ఇచ్చారు. నిషేధిత జాబితాలోని భూముల్లోనూ తహసీల్దార్ తనకు అధికారాలు లేకపోయినా పలు ఉత్తర్వులను జారీచేశారు. తహసీల్దార్ ఉత్తర్వులను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ స్పష్టంచేశారు.

## అరెస్ట్ కు సిద్ధం..

పలుకుతున్నట్లు అధికారికంగా తెలిపింది. అయినప్పటికీ, అరెస్ట్ ప్రయత్నాలు జరుగుతున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రొఫెసర్ నాగేశ్వర్ తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

**ఆయనంటే నాకు గౌరవం**

ఇటీవల రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుకుంటున్నప్పుడు వైసీపీ నాయకుడిని (జగన్ ను) అరెస్ట్ చేయాలని కోరినట్లు, దానికి అమిత్ షా తనపై క్లాస్ తీసుకున్నట్లు ఆ విశ్లేషకుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "ఆ రాజకీయ విశ్లేషకుడు అంటే నాకు గౌరవం ఉంది. కానీ విశ్లేషణ వేరు, వదంతులు వేరు. విశ్లేషకులు వాస్తవాల ఆధారంగా మాట్లాడాలి తప్ప, ఎవరో చెప్పారని విని మాట్లాడకూడదు. సర్దార్ పటేల్ తర్వాత అంతటి దృఢమైన హోంమంత్రి అమిత్ షా. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న వ్యక్తి ఆయన. అలాంటి వ్యక్తి గురించి తేలికగా మాట్లాడటం సరికాదు. ఒకవేళ నేరం జరిగితే చట్టం తనపని తాను చేసుకుపోతుంది. కోర్టులు, వ్యవస్థలు ఉన్నాయి. వాళ్లను జైల్లో పెట్టండి, వీళ్లను బయటకు తీయండి అని చెప్పడానికి నేనెవడిని? అలాంటి మాటలు మాట్లాడటం వ్యవస్థను అవమానించడమే. అయినా అదేం లాజిక్కో నాకు అర్థం కావడం లేదు. జగన్ ను జైల్లో పెడితే నేను సీఎం అవుతానా?" అని పవన్ మండిపడ్డారు. పార్టీలో నెలకొన్న అనైక్యత, అంతర్గత విభేదాలపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన, అసహనం వ్యక్తం చేశారు. బయటి శత్రువు దాడి చేయాలంటే లోపలున్న వాడే తలుపు తీయాలని, జనసేనలో కూడా అదే జరుగుతోందని వాపోయారు. "తమిళనాడులో ఒక హీరోని అభిమానిస్తే, అతని కోసం అభిమానులంతా ఏకతాటిపై నిలబడి సీఎంను చేశారు. కానీ ఇక్కడ నా అభిమానులు కూడా పాలిటిక్స్ అనగానే కులాలుగా, పార్టీలుగా విడిపోతున్నారు. పార్టీలోని కొందరు నాయకులే టీవీ ఛానెళ్లకు లీకులు ఇస్తున్నారు. ఒక అడుగు ముందుకు వేద్దామంటే మనవాళ్లే రెండు అడుగులు వెనక్కి లాగుతున్నారు. ఈ పరిస్థితి మారాలి" అని ఆయన అన్నారు. గడిచిన 12 ఏళ్లుగా ఎన్నో అవమానాలు, విమర్శలు భరించానని, పార్టీ శ్రేణుల కోసం ఎంతో సహనంగా ఉన్నానని, కానీ ఇకపై ఆ సహనం ఉండదని పవన్ తేల్చిచెప్పారు. "నా మౌనాన్ని బలహీనతగా తీసుకోవద్దు. భరించాను, సహించాను, అవసరమైతే తాట తీస్తానని గతంలోనే చెప్పాను. అది సినిమా డైలాగ్ కాదు, నాలోని సగటు మనిషి ఆవేదన. ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే, దాడి చేస్తే నవ్వుతూ భరించడానికి నేను సిద్ధంగా లేను. ప్రతి చర్యకు ప్రతిచర్య ఉంటుంది. ఇకపై పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని గట్టిగా హెచ్చరించారు.

# కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్

- **గుండ్ల పోచంపల్లిలో మున్సిపల్ కార్మికుల యూనియన్ సమావేశం**

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ & కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రమేష్, యాదమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ మున్సిపల్ సంఘం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యేసు రత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 23, 24 తేదీలలో జరగనున్న రాష్ట్ర మున్సిపల్ మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుగుల రేవంత్ రెడ్డి కార్మికులకు కనీస వేతనం రూ.20 వేలు పెంచామని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు.

కార్మికులను మూడు విభాగాలుగా విభజించి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అన్‌స్కిల్డ్ కార్మికులకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.16 వేల వేతనం నిర్ణయించడం, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.20 వేల వేతనం అమలు చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.30 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు 15 క్యాజువల్ లీవ్స్ మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే అమలు చేయాలని కోరారు. సమావేశం అనంతరం యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా బి. రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి. ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా డి. యాదమ్మ, పి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా వి. హరినాథ్ రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా బి. కిరణ్, సహాయ కార్యదర్శులుగా ఏ. శివ, డి. కృష్ణ, కోశాధికారిగా బి. భానుచందర్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సావిత్రి, దశరథ్, అనిత, అశోక్, బాలేష్, ఆంజనేయులు, అమృత, రజిత, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస్ నూతన కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## గ్యాస్ సిలిండర్ కొరతతో ప్రజల అవస్థలు

- **ఏజెన్సీల వద్ద గంటల తరబడి వినియోగదారుల నిరీక్షణ**

**జయభేరి, మేడ్చల్ :**

గ్యాస్ సిలిండర్ల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గృహ వినియోగ గ్యాస్ సరఫరాలో జాప్యం ఏర్పడటంతో వినియోగదారులు మేడ్చల్ గ్యాస్ ఏజెన్సీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. బుకింగ్ చేసినప్పటికీ సమయానికి సిలిండర్లు అందక మహిళలు, వృద్ధులు, వికలాంగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో కొన్ని రోజులుగా గ్యాస్ డెలివరీ నిలిచిపోవడంతో ప్రజలు వంట పనులకు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచే ఏజెన్సీల వద్దకు చేరుకున్న వినియోగదారులు "సిలిండర్లు ఎప్పుడు వస్తాయి?" ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు డెలివరీ బాయ్స్ బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు సిలిండర్లు విక్రయిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే సరఫరా సమస్య కారణంగా ఆలస్యం జరుగుతోందని ఏజెన్సీ సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ సరఫరాను సక్రమంగా నిర్వహించాలని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## ఆంజనేయస్వామికి అభిషేకం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ సమీపంలోని రాంనగర్ లో ఉన్న శ్రీ బాలాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకుడు రాజమూర్ హనుమేష్‌చారి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో స్వామివారు భక్తులకు అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్ పోలీసులకు ఆప్టర్ సంస్థ నుంచి సీసీటీవీ కెమెరాల విరాళం

**జయభేరి, మేడ్చల్ :**




కమ్యూనిటీ భద్రతను బలోపేతం చేయడంతో పాటు ప్రజా శ్రేయస్సును ప్రోత్సహించే దిశగా ప్రముఖ సంస్థ ఆప్టర్ మేడ్చల్ పోలీసులకు 12 సీసీటీవీ కెమెరాలను విరాళంగా అందించింది. అదనంగా ఇప్పటికే ఉన్న ఇతర సీసీటీవీ కెమెరాల నిర్వహణకు కూడా సంస్థ సహకారం అందించింది. మేడ్చల్ పట్టణంలోని కీలక ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు తోడ్పడే లక్ష్యంతో ఈ సహకారం అందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆప్టర్ బృందం సీసీటీవీ కెమెరాలను మేడ్చల్ పోలీసు అధికారులకు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ అందించిన సహకారం ప్రజల భద్రతకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజా ప్రదేశాలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడంతో పాటు నేర కార్యకలాపాలు, ప్రమాదాలను అరికట్టడంలో, అత్యవసర సంఘటనలకు వేగంగా స్పందించడంలో మాకు సహాయపడుతుందని సిఐ తెలిపారు. సామాజిక బాధ్యత పట్ల ఆప్టర్ సంస్థ చూపుతున్న నిబద్ధత అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలు సమాజ భద్రతకు మరింత బలాన్నిస్తాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ శ్రీనివాస్, ఆప్టర్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గిర్మాపూర్ మోడల్ పాలిటెక్నిక్‌లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

- **విలేకరులతో ప్రిన్సిపాల్ అరుంధతి**



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా గిర్మాపూర్‌లోని ప్రభుత్వ మోడల్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. పాలిటెక్నిక్ విద్య ద్వారా విద్యార్థులకు మెరుగైన భవిష్యత్ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన కొనసాగుతోందన్నారు. కళాశాలలో ఆధునిక ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, కంప్యూటర్ సదుపాయాలు, క్రీడా వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే విద్యార్థులకు ఉచిత సేవలు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పేద మరియు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ అరుంధతి సూచించారు. ఇంజినీరింగ్ రంగంలో మెరుగైన కెరీర్‌ను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులకు గిర్మాపూర్ మోడల్ పాలిటెక్నిక్ మంచి వేదికగా నిలుస్తోందని ఆమె తెలిపారు.

## వచ్చే వర్షాకాలం నాటికి లిఫ్టుల మరమ్మతులు పూర్తి

- **దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**

**జయభేరి, దేవరకద్ర :**



వచ్చే వర్షాకాలం నాటికి మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గం పరిధిలో ఉన్న సరళా సాగర్, కురుమూర్తి రాయ, నెల్విడి ఎత్తిపోతల పథకాల లను పునరుద్ధరించి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని ఆ ఎత్తిపోతల పథకాలను మంగళవారం ఎమ్మెల్యే జిఎంఆర్ సుడిగాలి పర్యటన జరిపి పరిశీలించారు. సంబదిత అధికారులు రైతులతో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సాధ్యా సాధ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గతంలో ఈ ఎత్తిపోతల పథకాలు శిథిలావస్థ చేరిన గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో ఈ ఎత్తిపోతల పరిధిలోని రైతులు సాగనీరు అందక ఎన్నో అవస్థలు పడ్డారని ఆవేదన వ్యక్తపరిచారు. గత ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందన్నారు. పథకానికి సంబంధించిన రైతులు సమస్యను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన లాభం లేకుండా పోయిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదట్లో ఈ ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. అట్టి ప్రతిపాదలను పరిశీలించిన ప్రభుత్వం వెంటనే వాటి పునరుద్ధరణకు నిధులు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేసిందన్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలకు ఎమ్మెల్యే జిఎంఆర్ కృతజ్ఞతలు తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని రైతాంగానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. రైతాంగానికి పుష్కలంగా సాగనీరు అందించాలన్న లక్ష్యంతోని పనిచేస్తున్నానన్నారు. దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

## జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- **దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**
- **రూ.5 లక్షల బీమాతో రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి**
- **ప్రజల భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వ సంకల్పం**



**జయభేరి, దేవరకద్ర :**

ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నదని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. జూన్ 2 నుంచి ప్రారంభం కానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ అందించ నుందన్నారు. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తికి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఆదుకునే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసాగా నిలుస్తూ, వారి భవిష్యత్తుకు రక్షణగా ప్రజా ప్రభుత్వం ముందుకు నడుస్తుందన్నారు. సంక్షేమం అంటే కేవలం పథకాలు ప్రకటించడం కాదు... ప్రజల కష్టకాలంలో వారికి అండగా నిలబడటమే నిజమైన పాలన అని ప్రజా ప్రభుత్వం నమ్మకమన్నారు.

ప్రతి కుటుంబానికి భరోసా.. ప్రతి ఇంటికి రక్షణ... అదే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

## మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

- **అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**జయభేరి, రాజన్న సిరిసిల్ల**

మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు సూచించారు. జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల సాగు నివారణ చర్యలు, విద్యార్థులు, యువత డ్రగ్స్ వినియోగించకుండా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వారికి వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీఅడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా బాధితులకు చికిత్స, మానసిక పరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, విద్యాసంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన భాస్కర్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో మృతుని కుటుంబ సభ్యులను మంగళవారం రాత్రి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి పరామర్శించారు. దేవరకద్ర మండల కేంద్రంలో బైండ్ల రాముడు కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న భాస్కర్ రెడ్డి దేవరకద్రలోని బైండ్ల రాములు ఇంటికి వచ్చి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ లో మంగళవారం పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 2004 బ్యాచ్ కు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. దాదాపు 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. చిలిపిచేష్టలను గుర్తుచేసుకొని సంబరపడ్డారు. కేక్ కట్ చేశారు. రోజంతా ఒకే దగ్గర ఉండి కలిసే భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 22 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని

**జయభేరి, తుర్కపల్లి, మే 26 :**

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అంబటి చెన్న కిష్టయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో తుర్కపల్లి గ్రామ పద్మశాలి సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం అధ్యక్షునిగా పెండెం జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షునిగా అంబటి చెన్న కిష్టయ్య, ఉపాధ్యక్షునిగా కళ్యాణం కృష్ణ ప్రధాన కార్యదర్శిగా పెండెం నరసింహులు, జాయింట్ సెక్రెటరీగా పిండం నరేందర్, కోశాధికారిగా సామల నర్సింలు ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా పెండెం రవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పెండెం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పద్మశాలిలు అందరూ ఐక్యంగా ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందజేస్తూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుని సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెండెం రాములు, పెండెం బలరాం, పెండెం పాండు, పెండెం శంకర్, పెండెం బాలు, పెండెం పాండు, గణపురం వనిత్, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## తగులబెట్టిన తాడి చెట్లను పరిశీలిస్తున్న నాంపల్లి ఎక్సైజ్ SI





**జయభేరి, చింతపల్లి :**

HMDA పరిధి వింజమూరు గ్రామంలో RRR ఫామ్ ల్యాండ్ వెంచర్ లో ఎలాంటి పర్మిషన్ లేకుండా తొలగించి తగులబెట్టిన తాడి చెట్లను పరిశీలిస్తున్న నాంపల్లి ఎక్సైజ్ (SI) సబ్ ఇన్స్పెక్టర్ వారితోపాటు వారి యొక్క బృందం 527 సర్వే నెంబర్లు తొలగించిన తాడిచెట్లపై ఆర్టిఐ కింద నాంపల్లి ఎక్సైజ్ ఆఫీసర్ కి దరఖాస్తు చేయడం ద్వారా తక్షణమే వచ్చి ఫీల్డ్ ఎంక్వైరీ చేయడం జరిగిందిచింతపల్లి మండలం వింజమూరు గ్రామంలో సర్వేనెంబర్ 527 లో RRR వెంచర్ పేరిట ఫామ్ ల్యాండ్ పేరుతో భూములను HMDA అనుమతులు లేకుండా విచ్చలవిడిగా రంగురంగు బ్రోచర్లతో వారి ఇష్టానుసారంగా ధర నిర్ణయించి విక్రయిస్తా ఉన్నారు వింజమూరు గ్రామం హెచ్ఎండిఏ పరిధిలో ఉన్న హెచ్ఎండిఏ పర్మిషన్ లేకుండా గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా ఎంపీడీవో పర్మిషన్ లేకుండా527 సర్వే నెంబర్లు రోడ్ల నిర్మాణం చేస్తున్న త్రిబుల్ RRR వెంచర్ ఫామ్ అండ్ ఓనర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి ఈ వెంచర్ లో కూలగొట్టిన తాడి చెట్లను కూలగొట్టి తగలబెట్టిన చెట్లను ప్రత్యక్షంగా నాంపల్లి ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ చూడడం జరిగింది ఈ చెట్లను పర్మిషన్ లేకుండా తొలగించారు కాబట్టి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆర్టిఐ దరఖాస్తు దారుడు ఆరేకంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

## కాలువలను సిబ్బందితో శుభ్రం చేపిస్తున్న 9 వ వార్డు కౌన్సిలర్ ముఖ్య సలహాదారులు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ 9 వార్డ్ కౌన్సిలర్ ముఖ్య సలహాదారులు ముత్యాల రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జామైన మురికి కాలువలను మున్సిపాలిటీ శుభ్రం చేసే సిబ్బంది వారిచే పనులు చేపట్టినారు మున్సిపల్ కమిషనర్ పరివేక్షణ AE రాజు గత కొంతకాలంగా దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ కౌన్సిలర్ ముఖ్య సలహాదారులు ముత్యాల రవికుమార్ యాదవ్ డ్రైనేజీలలో ప్లాస్టిక్ కవర్స్ చెత్తాచెదారం పడడంతో సాఫీగా మురుగునీరు పోకుండా బయటికి వస్తున్న పరిస్థితిని స్వయానా తెలుసుకున్న కౌన్సిలర్ ముఖ్య సలహాదారులు ముత్యాల రవికుమార్ యాదవ్ నేరుగా మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో కలిసి డ్రైనేజీ లో చెత్తను తొలగించి చర్యలు చేపట్టడం జరిగింది. శానిటరీ ఇన్స్పెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంధనం ధరలు తగ్గించే వరకు ఉద్యమం చేస్తాం

- ఐఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి పి. రఘునాయక్
- మహబూబ్ నగర్ పార్లమెంటరీ నియోజకవర్గ నేత పురుషోత్తం రెడ్డి
- షాద్ నగర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ధర్నా
- ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

**జయభేరి, షాద్ నగర్, మే 26 :**



పెరిగిన పెట్రోల్, డీజిల్ధరలు తగ్గించేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ను నిరసిస్తూ మంగళవారం షాద్ నగర్ నియోజక వర్గ కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఫరూక్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ తదితరుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలపై ఆర్డిఓ కార్యాలయం ముందు నినాదాలతో ఆందోళన చేశారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘునాయక్, మండల పార్టీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి రమేష్, జాకారం చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, జండాగూడెం సుదర్శన్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, మహిళా విభాగం నాయకురాళ్ళు తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆడియో సరితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి. రఘు నాయక్ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజల సంక్షేమాన్ని ఏనాడు పట్టించుకోలేదని ఆరోపించారు. దాన్యం కొనుగోలులో ఎఫ్సీఐ పూర్తిగా విఫలమైందని, మొక్క జొన్నకు మద్దతు ధర ప్రకటించి కేంద్రం చేతులు దులుపుకుందని విమర్శించారు. బంగారం కొనద్దని, పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలని పేర్కొంటున్న మోదీ మాత్రం లక్షల రూపాయల సూట్ వేసుకొని దేశాలు తిరుగుతున్నాడని ఆరోపించారు.

యువజన కాంగ్రెస్ నాయకుడు మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మత రాజకీయాలతో పబ్బం గడుపుతుందని విమర్శించారు.

భవిష్యత్తులో బిజెపి నాయకులను ప్రజలు అడ్డుకుంటారని కాంగ్రెస్ పార్టీ కూడా గ్రామాల్లో తిరగనివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి బిజెపి ప్రభుత్వం వేడుక చూస్తుందని త్వరలోనే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మార్కెట్లో పనికిమాలిన రాజకీయాలు బిజెపి చేస్తుందని గతంలో నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతుల నడ్డి విరిచిన బిజెపి నాయకులు సిగ్గుపడాలని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ అబద్దపు హామీలతో కాల యాపన చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచబోమని మాట్లాడిన ప్రధాని నరేంద్రమోదీ మాట తప్పారన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల వరకు దేశప్రజలను నమ్మించిన మోదీ, ఎన్నికలు పూర్తవగానే ధరలు పెంచేశారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం 28లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిందని, నీట్పరీక్ష రద్దు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. కేంద్రం ప్రజలపై భారం మోపడం దారుణం అన్నారు. ఈ ఆందోళనలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కో ఆర్డినేటర్ రఘు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, అన్మాగల్ల రమేష్ , జాకరాం చంద్రశేఖర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోనీ శ్రీధర్, జాండ గూడెం సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు, చల్లా శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,ఇబ్రహీం, ఖాదర్ ఘోరీ సర్పంచుల చించెడ్ శ్రీనివాస్ , ఆర్ బాబు నాయక్, ,కొమ్ము కృష్ణ, అయ్యవారి పల్లి గోపాల్ రెడ్డి, మంకల శ్రీశైలం, నర్సింహులు, తేజ్య నాయక్,కౌన్సిలర్ల బచ్చలి నరేష్, మురళి మోహన్, కొప్పునూర్ ప్రవీణ్, సొలిపూర్ అనిల్ ,నేతలు తుపాకుల శేఖర్, జాంగారి రవి, లింగారెడ్డి గూడ అశోక్, ఖదీర్, గిరిజన నేత శ్రీను నాయక్, బుద్ద నర్సింహులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్ణ కర్ , నర్సింహులు, సురేష్ గౌడ్,సొలిపూర్ శ్రీశైలం గౌడ్, జాంగారి జంగయ్య, చిన్న, ముభరక్ అలీ, కరోల్ల సురేందర్, దాఖం మనీష్, బాల గంగాధర్, చించెడ్ అనంతం, హైదర్ ఘోరీ, మల్లేష్ గౌడ్, మల్లరెడ్డి, నిరటి వాసు, సుమన్ నాయక్, భాస్కర్ నాయక్,మార్గం రాజేష్ , రోమియో రమేష్,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సింగాపగ అనిల్ కుమార్ , మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగి సాయిలు, భాస్కర్,గణేష్ నాయక్, రాజు నాయక్, కటి కేల తిరుపతి యాదవ్,కావాలి నర్సింహులు, కెవిఎం, మహేష్ యాదవ్, రమేష్, మహిళ నేతలు నాగమణి, గుండె రాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు..

# ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు నిధులు మంజూరు

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రతిపాదనలకు కార్యరూపం
- ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల
- ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రిలకు ఎమ్మెల్యే జిఎంఆర్ కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే జిఎంఆర్ ను అభినందిస్తున్న నియోజకవర్గ ప్రజలు, రైతులు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో ఉన్న సరళా సాగర్, కురుమూర్తి రాయ, నెల్విడి ఎత్తిపోతల పథకాలకు (లిఫ్టులు) మోక్షం లభించింది. వీటి పునరుద్ధరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసింది. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని ఈ ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదట్లో జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అట్టి ఎత్తిపోతల పథకాలను స్వయంగా పరిశీలించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడం జరిగింది. అట్టి ప్రతిపాదనలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. వెంటనే ఆ ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు నిధులను మంజూరు చేసింది. సరళ సాగర్ ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు ఒక కోటి 94 లక్షల 20వేల నిధులను మంజూరు చేసింది. అలాగే కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు ఒక కోటి 45 లక్షల ఇరవై వేల నిధులను మంజూరు చేసింది. నేల్విడి ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు దాదాపు 92 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తూ జీవోను కూడా విడుదల చేసింది. దీంతో ఎత్తిపోతల పథకాల పరిధిలోనున్న రైతులు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తుపరుస్తున్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ కృషిని అభినందిస్తున్నారు. ప్రతిపాదనలు పంపిన వెంటనే స్పందించి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలకు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే జిఎంఆర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ లోని లేబర్ అడ్డా దగ్గర రోడ్డు దాటుతున్న వ్యక్తికి TS 29T 9629 నెంబర్ గల లారీ మంగళవారం సాయంత్రం అందాజా 04:30 గంటల సమయంలో టక్కరివ్వగా అతనికి తీవ్ర గాయాలు కాగా అతనిని 108 అంబులెన్స్ సహాయంతో ఉస్మాని హాస్పిటల్ కు తరలించడం జరిగింది. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లు అయితే హయత్ నగర్ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వగలరు. గాయపడిన వ్యక్తి చూడడానికి బెగ్గర్ వలె ఉన్నాడు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు రామచంద్రు నాయక్
- బాల్యవివాహాల నిర్మూలన ప్రచార కార్యక్రమం

**జయభేరి, దంతాలపల్లి, మే 26 :**



మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి పాలన మహిళా వారోత్సవాలు లలో భాగంగా మండల స్థాయి బాల్య వివాహ నిరోధక ప్రచార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రు నాయక్ పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు జరిపించడం వలన మహిళలు అనేక రకాల వ్యాధులబారిన పడుతున్నారని, బాల్య వివాహాలతో వారి జీవితాలు మగ్గిపోతున్నాయని అన్నారు సరియైన వయసు వచ్చిన తర్వాతనే వివాహాలు జరిపించాలని అప్పుడు మహిళల్లో మానసిక శారీరక దృఢత్వం వస్తుందని అన్నారు బాల్య వివాహాల నిర్మూలన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సందర్భంగా తెలియజేశారు మరియు ప్రభుత్వ అధికారులు అంగన్వాడి సిడిపిఓ ఎల్లమ్మ, సూపర్వైజర్ కవిత గ్రామ ప్రజలు,కిశోర బాలికలు, గర్భిణీలు,మండలంలోని ఏ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్స్, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



## అగ్నికి ఆహుతైన తాటి వనాలు



**జయభేరి, హుజూరాబాద్ :**

హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్లో అగ్నికి ఆహుతైన తాటి వనాలను సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్. దాదాపు 1000 తాటి చెట్లు మంటల్లో కాలిపోయాయి. అందులో 100 కు పైగా తాటి చెట్లను కల్లు గీస్తున్నారు. ఈ ప్రమాదంతో గీత కార్మికులు జీవనోపాధిని కోల్పోయారు. రైతుల మోటర్లు, పైపులు, వైర్లు కూడా కాలిపోయి తీవ్రంగా నష్టపోయారు. ఇంత నష్టం జరిగినా అధికారులు ఎటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. వెంటనే స్పందించి తగిన సాయం అందించాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులు పంట పొలాల్లో ఉన్న వ్యర్థాలను తగుల పెట్టవద్దు. ఇలా కాలిపోయి నష్టం జరగడమే కాకుండా.. భూసారం కూడా పోతుంది. అప్రమత్తంగా ఉండి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని రైతులందరిని కోరుతున్నానని ఈటల రాజేందర్ అన్నారు.

## విద్యార్థులకు స్కాలర్షిప్ల పంపిణీ

ఉన్నత విద్య, విద్యావకాశాలపై ఎల్పీయూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని ఓ హోటల్లో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సౌరబ్ విద్యావకాశాలు, కెరీర్ ఆధారిత విద్య, ప్లేస్మెంట్స్, స్కాలర్షిప్ తదితర అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్పీయూ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంతం డిప్యూటీ డీన్, జోనల్ హెడ్ సంజీవ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ టి. షకీల్, జితేంద్ర కుమార్ దీక్షిత్, ప్రొఫెసర్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

